ప్రజాశక్తి

ఆదివారం 22 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి

ఉద్యోగ, ఉపాధ్యాయులకిచ్చిన హామీలు అమలుచేయాలి

- సిపిఎస్ రద్దు చేయాలి...
- పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి బాబురెడ్డి డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని అమలుచేయాలని పిడిఎఫ్ తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి డిమాండ్ చేశారు. మార్కాపురం పట్టణంతో పాటు పెద్దారవీడు మండలంలోని పాఠశాలలు, కళాశాలలతో పాటు కస్తూరిబాగాంధీ గురుకుల విద్యాలయాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బాబురెడ్డికి ఆదరణ లభించింది. బాబురెడ్డి విజయానికి కృషి చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాబురెడ్డి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. సిపిఎస్ రద్దు ప్రధానమైందన్నారు. సిపిఎస్ రద్దు చేసిన వెంటనే పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారులు చిన్నపాటి తప్పులకూ ఎలాంటి విచారణ లేకుండా సస్పెండ్ చేయడమేంటన్నారు. ఓ విధంగా ఉపాధ్యాయులను టార్చర్ పెడుతున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ... ఇబ్బంది పెట్టే పద్ధతులకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. 2023 జులై 1 నాటికి 12వ పిఆర్‌సి అమలు కోసం కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఒద్దుల వెంకటవీరారెడ్డి, బి.శ్రీరాములు, వెన్నా వెంకటరెడ్డి, పి.ప్రభాకర్, కె.ఎర్రయ్య, దండా వెంకటరెడ్డి ఉన్నారు.

వైసిపి శ్రేణుల్లో గందరగోళం

- చీరాల, అద్దంకి అభ్యర్థుల ఎంపికపై స్పష్టత ఇవ్వని అధిష్టానం
- కరణం వెంకటేష్ అద్దంకికి..?
- కృష్ణచైతన్యకు టిక్కెట్ లేదని ప్రచారం

కరణం వెంకటేష్

కృష్ణచైతన్య

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉమ్మడి ప్రకాశం జిల్లా వైసీపీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. చీరాల, అద్దంకి అభ్యర్థుల ఎంపికపై జరుగుతున్న ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళానికి కారణమవుతోంది. చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం తనయుడు, వైసిపి చీరాల నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న కరణం వెంకటేష్‌ను అద్దంకికి పంపిస్తారనే చర్చ నడుస్తోంది. అదే సమయంలో వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్యకు అసలు టిక్కెట్ లేదనే ప్రచారం ఊపందుకుంది. చీరాల వైసిపి అభ్యర్థిగా సునీత ఖరారయినట్లు పోతుల వర్గీయులు ప్రచారం చేసుకుంటున్నారు.

అద్దంకి, చీరాల నియోజకవర్గాల నుంచి అభ్యర్థుల మార్పు ఉంటుందని చాలా కాలంగా ప్రచారం ఉంది. వైసిపి అధిష్టానం ఇప్పటికీ చీరాల, అద్దంకి వైసిపి అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం స్పష్టత ఇవ్వడం లేదు. చీరాల, అద్దంకి నియోజకవర్గాల వైసిపి ఇన్‌ఛార్జిలుగా ఉన్న కరణం వెంకటేష్, బాచిన కష్ణచైతన్య గడిచిన నాలుగు రోజుల్లో ఒకరి తర్వాత ఒకరు అధిష్టానం పెద్దలను కలిశారు. గత బుధవారం బాచిన చెంచుగరటయ్య, కృష్ణచైతన్య సిఎం జగన్‌ను కలిశారు. గురు, శుక్రవారాల్లో కరణం వెంకటేష్ తాడేపల్లిలో ఉన్న సియమ్‌వో కార్యాలయానికి వెళ్ళారు. అక్కడి పెద్దలు, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల, ధనుంజయరెడ్డి, మాజీ మంత్రి బాలినేనిని కూడా వీరు కలిసినట్లు తెలుస్తోంది. గతంలో సిఎం జగన్‌ను కరణం బలరాం, వెంకటేష్ కలిసినప్పుడే చీరాల నుంచి రానున్న ఎన్నికల్లో వెంకటేష్ పోటీ విషయమై స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా పార్టీ అధినేత జగన్ పార్టీ ముఖ్యులతో సమావేశమవుతున్న క్రమంలో రెండు నెలల క్రితం అద్దంకి నియోజకవర్గ నేతలతో కూడా సమావేశమయ్యారు. ఆ సమయంలోనే కృష్ణ చైతన్య అద్దంకి నుంచి పోటీ విషయమై స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కరణం వెంకటేష్, కృష్ణ చైతన్య తమ నియోజకవర్గాల్లో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటూ వచ్చారు. నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులుగా ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న క్రమంలో ఈ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ప్రచారం వైసిపి శ్రేణుల్లో గందరగోళానికి కారణమవుతోంది.

చీరాలలో 23న సమన్వయ కమిటీ సమావేశం

ఎన్నికలకు సన్నద్ధమవుతున్న వైసిపి అధిష్టానం నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ఖరారు చేస్తూ పార్టీ కేడర్‌ను ఇందుకు సమాయత్తం చేసే పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో పాటు ఎన్నికల్లో ఎవరు పోటీ చేయనున్నారు అనే విషయమై స్పష్టత ఇచ్చేందుకు పార్టీ సమన్వయ కమిటీ సమావేశాలు జరుపనున్నారు. ఈ మేరకు ఈ నెల 23న చీరాల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారు. రీజనల్ కో ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు ఈ సమావేశాల్లో పాల్గొని ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేయనున్నారు. అద్దంకి నియోజకవర్గ స్థాయి సమావేశం కూడా ఈ నెల 24న జరుగనున్నట్లు తెలుస్తోంది. చీరాల, అద్దంకి నియోజకవర్గాల నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయమై పలు రకాలు ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల పార్టీ కేడర్‌కి ఒక స్పష్టత ఈ సమావేశాల్లో ఇస్తారని కార్యకర్తలు భావిస్తున్నారు.

ఒంగోలుకు 'అమృత' ధారలు.!

- నీటి సరఫరా పథకానికి అమృత్ 2.0 పథకంలో రూ.339 కోట్లు మంజూరు
- ట్యాంకుల అభివృద్ధికి మరో రూ.6 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరానికి 'అమృత' ధారలు రానున్నాయి. నగరంలో తాగునీటి వ్యవస్థను నవీకరించేందుకు అమృత్ 2.0 పథకంలో ప్రభుత్వం రూ.339.93 కోట్లు మంజూరు చేసింది. నీటి జలాశయాలను పునరుద్ధరించేందుకు మరో రూ.6 కోట్లు మంజూరయ్యాయి. వెరసి అమృత్ 2.0లో ఒంగోలు నగరానికి మొత్తంగా రూ.345.63 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల భాగస్వామ్యంతో ఈ పథకంలో తాగునీటి వ్యవస్థను నగరంలో మెరుగుపరచనున్నారు. ఒంగోలు నగరానికి రోజూ తాగునీటి సరఫరా చేయాలంటే ఈ పాటికే ఉన్న పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని, కొత్త ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలని, పైప్‌లైన్లు లేని ప్రాంతాలకు కొత్తగా పైప్‌లైన్‌లు వేయాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించారు. ఇందుకోసం నగరానికి నిధులు కేటాయించాలని కోరారు. బాలినేని శ్రీనివాసరెడ్డి విజ్ఞాపన మేరకు గత ఏడాది ఒంగోలు వచ్చిన సిఎం నగరంలో తాగునీటి సరఫరా కోసం రూ.400 కోట్లు నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన హామీ మేరకు అమృత్ 2.0లో రూ.339.93 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ నెంబర్ 12ని ఈ నెల 20వ తేదిన విడుదల చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.110.87 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.196.32 కోట్లు, యుఎల్‌బి ఫండ్ రూ.1.91కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధి నుంచి రూ.23.54 కోట్లు. నగరపాలక సంస్థ వాటా రూ.7.29 కోట్లుగా నిర్ధారించారు. ఒకటి, రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, రంగరాయుడు చెరువు, ముక్తినూతలపాడు చెరువుల వద్ద నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి ▶ 2లో

మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు నుంచి వైసిపి తరపునే పోటీ చేస్తా..

- మార్చిలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ
- అప్పుడే తాగునీటి పథకానికి కూడా శంకుస్థాపన
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రానున్న ఎన్నికల్లో వైసిపి తరపున తాను ఒంగోలు నుంచే పోటీ చేస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తాను చంద్రబాబునాయుడితో మాట్లాడుతున్నానని, తన స్థానంలో బాలినేని శ్రీనివాసరెడ్డి పోటీ చేయడానికి సిద్దంగా ఉన్నారని దామచర్ల జనార్ధన్ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రచారాలను నమ్మవద్దని కోరారు. అమృత్ 2.0 పథకం ద్వారా నగరంలో తాగునీటి సరఫరా ఆధునీకరించేందుకు ప్రభుత్వం రూ.339కోట్లు నిధులు కేటాయిస్తూ జీఓ ఎంఎస్ నెంబర్ 12ని విడుదల చేసిన సందర్భంగా వైసిపి శ్రేణులు శనివారం నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. సంఘమిత్ర బైపాస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కార్పొరేషన్ కార్యాలయం వరకు జరిగింది. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ▶ 2లో

బాలినేనిపై పోటీకి సిద్ధం

- జీవోకే హడావుడి చేయటం ఎందుకు?
- వైసిపి ర్యాలీలకు నిబంధనలు వర్తించవా.!
- ప్రెస్‌మీట్‌లో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజావక్తి - ఒంగోలు కలెక్టరేట్

బాలినేనికి భయపడి పారిపోయే వారు ఇక్కడ ఎవరూ లేరని, రాబోయే ఎన్నికలలో బాలినేనిపై తాను పోటీకి సిద్ధమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు స్పష్టం చేశారు. స్థానిక బికె ఎన్‌క్లేవ్‌లోని దామచర్ల నివాసంలో శనివారం రాత్రి జరిగిన పాత్రికేయుల సమావేశంలో దామచర్ల మాట్లాడారు. ఒంగోలు నగరానికి తాగునీటి సరఫరా కోసం నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోకే ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి హడావిడి చేస్తున్నారని విమర్శించారు. టెండర్లు ఎప్పుడు పిలుస్తారు, పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరానికి తాగునీటి సరఫరా కోసం నిధులు మంజూరు చేసిన జీవోను చూసి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. జీవోలో ఒక్క ఒంగోలుతో పాటు సుమారుగా 60 నగరాలకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.123కోట్లతో అమత్ పథకంలో మంజూరైన పనులు తమ ప్రభుత్వం దిగే నాటికి 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు పూర్తి చేయాలని గత నాలుగేళ్లుగా అడుగుతుంటే కొత్తగా మరొక పథకంలో నిధులు మంజూరు అయ్యాయన్నారు. అందులో రూ.30 కోట్లు మున్సిపల్ నిధులని తెలిపారు. నిధులు ఎప్పుడు మంజూరవుతాయి.. టెండర్లు పిలిచి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ లెక్కన తమ ప్రభుత్వంలో నెలకు ఒక్క ర్యాలీ చేయాల్సి ఉందన్నారు. గత నాలుగేళ్లుగా పనులు చేయని ఎమ్మెల్యే బాలినేని ▶ 2లో

అమృతధారలు..!

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు, నీటి కట్టలను అభివృద్ధి చేసి గ్రీనరీని ఏర్పాటు చేసేందుకు, రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, రంగరాయుడు చెరువుమీద వాకర్స్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు గాను మరో రూ.6 కోట్లు కేటాయించారు. ఈ నిధులను ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ నుంచి ఖర్చు చేస్తారు. మొత్తంగా ఒంగోలు నగరానికి జీఓ నెంబర్ ఎంఎస్ నెంబర్ 12 ద్వారా రూ.345.63కోట్లు కేటాయించడం పట్ల అధికార వైసిపి శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు సాధించిన స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలుపుతూ ఆపార్టీ శ్రేణులు శనివారం నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. సంఘమిత్ర బైపాస్ రోడ్డు నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాలినేనిపై పోటీకి సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు సమీపిస్తున్న వేళ చేస్తున్న హడావుడిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

వైసిపి ర్యాలీలకు నిబంధనలు వర్తించవా?

టిడిపి ర్యాలీలు చేసుకోడానికి పోలీసులు 100 కారణాలు చెబుతారని, వైసిపి ర్యాలీలకు అలాంటి అడ్డంకులు ఏమీ ఉండవని దామచర్ల విమర్శించారు. ఎమ్మెల్యే బాలినేని తన అవినీతిపై మాట్లాడుతున్నారని, ఒక్కసారి నిరూపించాలని అడిగినా నేటికీ సమాధానం లేదన్నారు. అవినీతి పనులతో బాలినేనికి మంత్రి పదవి పోయిన విషయం ప్రజలకు తెలుసని, నీ కొడుకు రూ.5 వేలు, రూ.10 వేలకు కక్కుర్తి పడి ప్రజలను ఏడిపిస్తున్న సంగతి ఒంగోలులో అందరికీ తెలుసని పేర్కొన్నారు. నేను చేసిన అభివృద్ధి, నీవు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని దామచర్ల సవాల్ విసిరారు. సమావేశంలో ఏఎంసి మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బండారు మదన్, తిప్పరమల్లి రవితేజ, వేమూరి వెంకటేశ్వర్లు, నల్లమోతు రమేష్, పాటిబండ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

వైసిపి తరపునే పోటీ చేస్తా..

(మొదటిపేజీ తరువాయి)

ఒంగోలు నగర ప్రజల తాగునీటి కష్టాలను తమ ప్రభుత్వం తీర్చనుందన్నారు. నగర ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు నిధులు ఇవ్వాలని గత ఏడాది ఒంగోలు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాను కోరానని, తన విజ్ఞాపన మేరకు ఆయన నిధులు ఇస్తామని గతంలో చెప్పడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అమృత్ పథకంలో రూ.339 కోట్లు నిధులిస్తూ జీవో ఇచ్చారని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఒంగోలు నగర ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ మీద భారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేలా నిబంధనలు సవరించడం హర్షించదగిన విషయమన్నారు. కార్పొరేషన్ మీద భారం మోపి గత పాలకులు అభివృద్ధి అని చెప్పుకున్నారని ఆరోపించారు. రోడ్లు మీద రోడ్లు వేయడం, కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజీలు తీసుకోవడం అభివృద్ధా...? అని ఆయన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాము తీసుకొచ్చిన అమృత్ పథకంలో నగరంలో కొత్తగా 18 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి వేయడం, నగరంలో అన్ని ప్రాంతాలకు కొత్తగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ పనులన్నీ పూర్తయిన తరువాత నగర ప్రజలకు పగటి వేళలోనే తాగునీరు ఇస్తామని, భవిష్యత్తులో ఒంగోలు నగర ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే పరిస్థితి ఉండదని ఉద్ఘాటించారు. తాను ఇచ్చిన హామీ మేరకు ఒంగోలు నగరంలో 25 వేల మంది పేదలకు ఈఏడాది మార్చిలో ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో దాదాపు 150 స్థానాలకు తగ్గకుండా వైసిపి విజయఢంకా మోగిస్తుందని... సమావేశంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వేమూరి బుజ్జి, వెలనాటి మాధవరావు, కమిషనర్ ఎం.వెంకటేశ్వర రావు, ఇంజినీర్ కె.మాల్యాద్రి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్, బిసిసెల్ జిల్లా అధ్యక్షులు కటారి శంకర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

విభజన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ప్రత్యేక హోదా విభజన హామీల సాధనకై రౌండ్ టేబుల్ సమావేశం బాపట్ల ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ప్రత్యేక హోదా విభజన హామీల సాధనకై రౌండ్ టేబుల్ సమావేశం బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు విద్యార్థి యువజన సంఘాల నాయకులు ప్రజాస్వామ్యవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 15 ఏళ్ళ ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి నేడు మురిసిన అధ్యయంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రంలో 2019 వరకు ప్రత్యేక హోదా అనే అంశం అన్ని రాజకీయ పార్టీలకు ఒక అవకాశంగా వాడుకున్నారని, ప్రధానంగా రాష్ట్రంలోని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రత్యేక హోదా తన జన్మ హక్కుగా మాట్లాడుతూ 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రత్యేక హోదా చేస్తానని

మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు గంగయ్య

ప్రగల్భాలు పలికారు కానీ నేడు రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ 23 మంది ఎంపీలను పెట్టుకొని మోడీ కింద సాగిలపడి మొక్కుతున్నారని అన్నారు. ఆనాడు పాదయాత్ర ఆయన స్వార్థ ప్రయోజనం కోసమా, రాష్ట్ర ప్రయోజనాల కోసమా అని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్రంలో రోజురోజుకూ అప్పు పెరిగిపోతోందని, ఈ పరిస్థితుల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా ప్రత్యేక హోదా అవసరమని కానీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజల నోరులను కప్పేదుతుందని ప్రశ్నించే వారిపై చీకటి జీఓలతో ఉరి తీస్తున్నారని మండిపడ్డారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు సుభాని మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు కోసం విద్యార్థి యువజన సంఘాలు బస్సుయాత్ర చేస్తుంటే కావాలనే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం యాత్రను ఆపడానికి చూస్తుందని, దీనిని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశామని, మరో మూడు రోజుల్లో డిజిపి అనుమతిస్తూ ప్రకటన చేయాలని హైకోర్టు చెప్పిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం మీద చేసే బస్సు యాత్రకు మద్దతు తెలపాల్సిన జగన్ మోహన్ రెడ్డి ఆటంకాలు కల్పించడం సిగ్గుచేటని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు రైల్వే, ఎల్ఐసి, విశాఖ ఉక్కు, బిఎస్ఎన్ఎల్ అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేస్తూ దేశ సంపదను అప్పనంగా తమ అనుచరులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలు మానుకోకుంటే 2024 ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బాషా, జన విజ్ఞాన వేదిక నాయకులు భాస్కర్, మాల మహానాడు సేలం రోజన్ బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి శరత్, జై భీమ్ భారత పార్టీ విజయ్ భరత్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణమోహన్, నాయకులు పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-దరిశి

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని దరిశి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు రవికుమార్ అన్నారు. శనివారం 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా స్థానిక రవాణ శాఖ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు వాహనచోదకులతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనం నడపరాదని, వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దని ఎంవిఐ రవికుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వాహనచోదకులు పాల్గొన్నారు.

విజయలక్ష్మికి నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడురూరల్

మండలంలోని మన్నంవారిపాలెం గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్, సీనియర్ నాయకులు అద్దేపల్లి కోటరాజు సతిమణి విజయలక్ష్మి(65) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిఎన్ విజయ్‌కుమార్ ఆమె భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు , .నివాళ లర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు , బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, ఎండ్లూరు మాజీ సర్పంచ్ బొమ్మినేని సుబ్బారావు, శేషంరాజు , చిట్లెంశెట్టి శ్రీనివాసరావు ,నలగట్ల సుబ్బారావు,సీపీఎం నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు బంకా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, జనవరి 26న దేశవ్యాప్తంగా జరిగే ట్రాక్టర్స్ ర్యాలీని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె హరిబాబు పిలుపునిచ్చారు. శనివారం బాపట్ల ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు వసంతరావు అధ్యక్షత వహించారు. అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే కార్యక్రమం నిలుపు చేయాలని, పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి ప్రతి ఒక్క రైతుకు బీమా పరిహారం అందించాలని అన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి అనేక రూపాలలో ఉద్యమాలు, నిరసనలు తెలుపుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించు కోకపోగా, రైతులపై భారాలు పడేవిధంగా ఎరువుల ధరలు అధికం చేయటం, సబ్సిడీలు ఎత్తివేయడం, వివిధ రకాల పన్నులు విధించడం సరికాదని అన్నారు. పాడి పరిశ్రమను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దీనికి అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో అమలుపరిచే విధంగా పరిపాలన సాగుతోందని అన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే గొట్టిపాటి

ప్రజాశక్తి-పంగులూరు

గోరంట్ల శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పంగులూరులో పలువురిని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ శనివారం పరామర్శించారు. పంగులూరుకు చెందిన గోరంట్ల శ్రీనివాసరావు గుండెపోటుతో అకాల మరణం చెందగా, ఆయన మృతదేహాన్ని శనివారం ఉదయం అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. శ్రీనివాసరావు మరణానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పంగులూరులోని ఎస్సీ కాలనీలో, ఇటీవల మరణించిన అన్నంగి నాగయ్య (డ్రైవర్ నాగులు) దశదిన కార్యక్రమానికి హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను రవికుమార్ పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, పార్టీ మాజీ అధ్యక్షులు చింతల సహదేవుడు, గొట్టిపాటి ఖాజా స్వామి, మేడ సుబ్బారావు, సాంబయ్య, చిలుకూరు కోటయ్య, అట్లూరి లాజరు, జాగర్లమూడి బుచ్చయ్య పాల్గొన్నారు.

గుండ్లకమ్మ కాలువలో చేపల వ్యర్థాలు

ప్రజాశక్తి-మద్దిపాడు: గుండ్లకమ్మ జలాశయం నుంచి నాలుగు మండలాలకు తాగునీరు సరఫరా అవుతోంది. అలాంటి జలాశయం ఒడ్డున అన్నంగి మత్స్యకారులు మూడు బజారుల కూడలిలో, మూడు చేపల అమ్మకాల కొట్లు పెట్టారు. సదరు గ్రామస్తులే కాక మండలంలోని వివిధ గ్రామాల నుంచి కొనుగోలుదారులు వచ్చి జలాశయంలో పట్టిన చేపలను కొనుగోలు చేస్తారు. వాటిని అక్కడే శుభ్రం చేయించుకొని వెడతారు. కానీ సదరు చేపల వ్యర్థాలను తిరిగి గుండ్లకమ్మ కాలువలో పోస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

CHANGE OF NAME

I, SADHU TULASI PATHI (Old Name) son of SADHU DAMODARA NAIDU resident of 37-1-434 (7/3) Flat No. 101, Saroj Pride Apartment, 1st Line, Ramnagar, ONGOLE, Prakasam Dist. A.P. hereby declare that I have changed my name as

SADHU THULASI PATHI

(New Name)

hereafter call all purpose in future.

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 120/2021

పిటీషన్:

గోలుగురి శ్రీనివాసరెడ్డి, తండ్రి: సత్తిరెడ్డి, పందలపాక గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా. ...వాది

మరియు

తన్నెరు ఏడుకొండలు, తండ్రి: పోలయ్య, జెండా చెట్టు దగ్గర, కమ్మ బజార్ ఏరియా, సంతనూతలపాడు గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523 225. సెల్: 90593 74218 ...ప్రతివాది

పై నెంబరు దావా గ్రంథమునకు గాను ప్రతివాది హాజరు నిమిత్తం మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్స్ / నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా సదరు కోర్టు సమన్స్ / నోటీసులు త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.09-03-2023 ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)

టి.వి.వి.రమణమూర్తి

అడ్వకేట్, దుప్పలపూడి.

సెల్: 96527 36367

పథకం ప్రకారం హత్య చేశారు..

- వ్యక్తి హత్య కేసులో అన్నా చెల్లి అరెస్ట్
- విలేకరుల సమావేశంలో సిఐ సోమశేఖర్

ప్రజాశక్తి-చీరాల

మహిళను అనుమానిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిని పథకం ప్రకారం అతనిపై తీవ్రంగా దాడిచేసి అతని చావుకు కారణమైన ఇద్దరు వ్యక్తులను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం సాయంత్రం రెండో పట్టణ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సోమశేఖర్ వెల్లడించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పి రామకృష్ణారెడ్డి (45), సాయికాలనీకి చెందిన వివాహితురాలు ఆర్ జ్యోతికి కొన్ని సంవత్సరాలుగా ఉన్న పరిచయంతో వీరు సహజీవనం చేస్తున్నారు. అయితే కొంతకాలంగా జ్యోతిపై అనుమానంతో రామకృష్ణారెడ్డి తరుచుగా గొడవపడుతూ ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో ఈ విషయాన్ని జ్యోతి... తన అన్న బెంజిమన్‌కు చెప్పటంతో ఎలా అయినా సరే రామకృష్ణారెడ్డిని

వివరాలు వెల్లడిస్తున్న సిఐ సోమశేఖర్

హతమార్చాలని వీరిద్దరూ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఈ నెల 5వ తేదీన రాత్రి సుమారు 11 గంటలకు తన ఇంటికి రమ్మని జ్యోతి రామకృష్ణారెడ్డికి చెప్పడంతో అతను వచ్చాడు. అనంతరం జ్యోతి, బెంజిమన్‌లు కలిసి అతడిని ఇంటి సమీపంలో ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లి కర్రలతో తీవ్రంగా దాడిచేశారు. రామకృష్ణారెడ్డి చనిపోయాడని అనుకుని అక్కడి నుంచి ఇద్దరూ పరారయ్యారు. అనంతరం క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రిలో చేర్పించగా అతను ఈ నెల 16వ తేదీ రాత్రి మృతిచెందాడు. దీనిపై మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం సాయంత్రం నిందితులు జ్యోతి, బెంజిమన్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన కర్రలను స్వాధీనం చేసుకుని ఇద్దరినీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించటంలో కృషిచేసిన ఐ సోమశేఖర్, ఎస్ఐ పి సురేష్, కానిస్టేబుల్ సుబ్బారావు తదితర సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్, చీరాల డీఎస్పీ పి శ్రీకాంత్ అభినందించారు.

సీఎం జగన్‌ను ప్రజలు ఆదరించాలి

ప్రజాశక్తి-నిజాంపట్నం

సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేదవానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు ఆదరించాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున కోరారు. శనివారం మండలంలోని పల్లపట్ల గ్రామంలో మూడో రోజు నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎంపీ మోపిదేవితో పాటు ముఖ్యఅతిథిగా మంత్రి మెరుగు నాగార్జున పాల్గొని గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లినప్పుడు అవ్వాతాతల మోహములో చిరునవ్వు కనిపిస్తోందని అన్నారు. ప్రజలందరూ వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పాదయాత్రలో ప్రజల కష్టసుఖాలను దగ్గరగా చూసిన వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాలను ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రతి ఇంటికి ఒక అన్న, తమ్ముడిలా, ఇంటికి పెద్ద కొడుకులా, విద్యార్థుల పట్ల మామయ్యలా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు.

గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మోపిదేవి, మంత్రి మేరుగ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్ ధ్యేయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ మోహన్‌రెడ్డి నూటికి నూరు శాతం నెరవేర్చారని చెప్పారు. కులం, మతం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఎక్కడ అవినీతికి ఎక్కడా తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే నగదు జమ చేస్తూ పారదర్శకంగా నవరత్నాలను సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి చేరువ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి హరనాథ్ బాబు, జెడ్పిటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్ గంగుల రత్న ప్రసాద్, ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి, తహశీల్దార్ ఎం శిరీష, ఎంపీటీసీ నాజర్ ఖాన్, మండలంలోని అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-దరిశి

దరిశి నగర పంచాయతీలోని శ్రీనివాస థియేటర్ వెనుక పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,870 సీజ్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారిని కోర్టుకు హాజరుపరుస్తామని వెల్లడించారు.

జగనన్న కాలనీలో 100 శాతం ఇళ్ల నిర్మాణం జరగాలి

ప్రజాశక్తి-పంగులూరు

జగనన్న కాలనీలలోని లేఅవుట్లలో నూరు శాతం ఇళ్ల నిర్మాణాలు జరగాలని, అందరు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ, జేవిఎస్ఆర్‌సి ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలో, శనివారం జగనన్న కాలనీ ప్రత్యేక అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది నాటికి రాష్ట్రంలో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గృహప్రవేశాలు చేయాలన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో10,500 గృహాలు, మండలంలో 347 గృహాలు పూర్తి చేయాలని అన్నారు. ఇందులో భాగంగా వెలుగు కార్యాలయం నుంచి లబ్దిదారులకు పునాదులు నిర్మించుకునేందుకు ఒక్కొక్కరికి 35 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ముందుకు వెళ్లేందుకు ఉపాధి, వెలుగు, హౌసింగ్, సచివాలయం సిబ్బంది అందరు సమన్వయంతో పనిచేసి ఉగాది నాటికి పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, హౌసింగ్ జేయి కిషోర్, ఏపీఎం జ్యోతి ప్రసాదు, ఏపీవో లక్ష్మీదేవి, ముప్పవరం గ్రామ సర్పంచి సాంబశివరావు, ఎంపీటీసీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పరిశీలించిన ఏడీ

ప్రజాశక్తి-మద్దిపాడు

వివాదాస్పద రహితంగా భూముల రీ సర్వే చేయాలని భూముల సర్వే అధికారి బాషా ఆదేశించారు. మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలోని రీ సర్వే హద్దు రాళ్లను శనివారం ఏడి పరిలించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బాబురావు, విఆర్ఒ అరుణ, సచివాలయం సర్వేయర్లు సుశీల్, శ్రీను, శివశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు

అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ● ఒక్క నిముషం ఆలస్యమయినా అనుమతిలేదు: ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షల కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం జిల్లాలో జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 15 పరీక్షా కేంద్రాలలో 8,567 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని, పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటల లోపల పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పరీక్షా హాల్‌లోకి అనుమతించడం జరుగుతుంది. 10 గంటల తరువాత ఒక్క నిముషం ఆలస్యం అయినా, పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించబడరు. పరీక్ష మొత్తం పూర్తయ్యే వరకు అనగా మధ్యాహ్నం 1 గంట వరకు అభ్యర్థులను పరీక్ష హాల్ బయటకు అనుమతించేది లేదన్నారు. పరీక్ష రాసేందుకు వచ్చిన ప్రతి ఒక్క అభ్యర్థిని పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష హాలులోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్‌లు, బ్లూ టూత్ పరికరాలు, వాచ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా హాలులోకి తీసుకొని పోవడానికి అనుమతిలేదని

పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌తో పాటు ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు, పెన్సిల్ మరియు బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని జిల్లా ఎస్పీ సూచించారు.

అభ్యర్థులు ఎవరయినా పరీక్షకు సంబంధించి అవకతవకలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వారు భవిష్యత్తులో ఎటువంటి ఉద్యోగాలు రాకుండా అనర్హులవుతారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద డ్యూటీలో వున్న వారిని, అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తారన్నారు. ఇతరులు ఎవరైనా పరీక్ష కేంద్రంలో కానీ, పరీక్ష కేంద్రం సమీపంలో గాని ఉన్నట్లయితే చట్టపరమయిన చర్యలు తీసుకుంటారు. కాపీయింగ్ లేదా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడి పట్టుబడితే తదుపరి పోలీస్ నియామకాలలో ప్రవేశం కోల్పోవడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్144 సిఆర్‌పిసి అమలులో ఉంటున్నందున ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. పరీక్షా కేంద్రాలకు దగ్గరలో గల జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్‌లు అన్నీ మూసి వేయిస్తామని తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష రిక్రూట్మెంట్ అంతా పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఫిజికల్, రాత పరీక్షలలో ఉత్తీర్ణత అయితేనే ఉద్యోగాలు వస్తాయని, అభ్యర్థులు గుర్తుంచుకోవాలని అన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎవరు కూడా ప్రైవేట్ వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని, ఏదయినా సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తహశీల్దారు కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని

రీ సర్వేకు రైతులు సహకరించాలి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని చీరాల ఆర్డీవో సరోజిని అన్నారు. శనివారం పంగులూరులోని తహశీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో పరిశీలించారు. కార్యాలయంలో గల పలు రికార్డులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ప్రస్తుతం మండలంలో అలవలపాడు, తూర్పు కొప్పెరపాడు, చందలూరు, గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతోందని, ఈ రీ సర్వేకు రైతులు సహకరించాలని అన్నారు. ఈ రీ సర్వే ప్రభుత్వ రికార్డుల ప్రకారమే జరుగుతుందని, ఎక్కడా రైతుల పొలాల గట్లు చెరపకుండానే రీ సర్వే నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పద్మావతి, ఆర్ఐ రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

ప్రజాశక్తి-రేపల్లె

మాదకద్రవ్యాల నిరోధంపై మండలంలోని పేటేరు గ్రామంలో ఎస్ఇబి అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. నిషేధిత మత్తుపదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని, మత్తులో నేరాలు చేసి సమాజంలో నేరస్తులుగా మారవద్దని డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామ న్నారు. చట్ట ప్రకారం హెరాయిన్, కొకైన్, గంజాయి, నాటు సారా లాంటి, మత్తు పదార్థాలు వాడడంతో మనిషి మెదడుపై మత్తు ప్రభావంతో ఆలోచనా శక్తి నశించి యువత నేరాలు బాట పడుతున్నారని అన్నారు. అలాంటి చెడుదారుల్లో ఉండక సరైనమార్గంలో నడుచుకోవాలన్నారు. మాదకద్రవ్యాలు వాడుతూ పట్టుబడ్డా లేదా రవాణా చేసినా శిక్షలు చాలా కఠినంగా ఉంటాయని అన్నారు. ఉన్నత చదువులు చదువుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేటేరు గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కొండపి: కొండపి మండలం పెదకండ్లగుంట గ్రామం పొలాల్లో శనివారం నాడు కోడి పందేలు ఆడుతున్న 8 మంది పట్టుకున్నట్లు ఎస్ఐ కె రామకృష్ణ తెలిపారు. కోడిపందేలు ఆడుతున్న వారి వద్ద నుంచి 3 కోళ్లు రూ.12,300 నగదు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కనిగిరి: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన శనివారం కనిగిరి మండలం కార్తీపురం సమీపంలోని హైవే రోడ్డు మీద చోటు చేసుకుంది. కార్తీకపురం గ్రామానికి చెంచయ్య(70) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా పామూరు నుంచి కనిగిరి వైపు వెళ్తున్న టాటామ్యాజిక్ వాహనం ఢీకొనటంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను విచారిస్తున్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఏర్పాటు శుక్రవారం రాత్రి స్థానిక ఎంవి రాజుపాలెం ఉర్దూ పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల శాఖ అధ్యక్షులు శ్రీ పేరం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా జిల్లా యుటిఎఫ్ కోశాధికారి ఎం వెంకటేశ్వరరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు జె వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కర్లపాలెంలో యుటిఎఫ్ అధ్యక్షునిగా ఎండి మున్వర్ బాషా, ప్రధాన కార్యదర్శిగా వైవి నారాయణతో పాటు కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ప్రభాకర్, ఆర్ రమేష్, ఎండి అక్రమ్ ఘోరి, బి భాను ప్రకాష్, వై భాస్కరరావు, ఎన్ కోటేశ్వరరావు కె విమలమ్మ, జె శ్యామసుందరి, ఈ పోలీసురావు తదితరులు పాల్గొన్నారు.

గృహాలను సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-చిన్నగంజాం

గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సిఇఒ జాలిరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండల పరిధిలోని చిన్నగంజాం, కొత్తపాలెం గ్రామాల్లోని జగనన్న లేఅవుట్‌లలో పర్యటించారు. జాలిరెడ్డి లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులను మొత్తం గృహాలు, ఏయే లెవెల్లో, ఎన్నెన్ని ఉన్నాయో అడిగి తెలుసుకొన్నారు. జగనన్న కాలనీలకు అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి సిఇఒను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి విజయలక్ష్మి, ఇఒఆర్‌డి కె స్వరూపారాణి, గృహ నిర్మాణ శాఖ ఎఇ రాజశేఖర్, పంచాయతీ సెక్రటరీ బాబురావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండలంలో పలు గ్రామాలలో శనివారం మండల ప్రత్యేక అధికారి హనుమంతరావు చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా నిర్దేశించిన గదులలో ఉంచి తడి చెత్త నుంచి వర్మికంపోస్టు తయారు చేసుకుని, పొడి చెత్త ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. ఘన వ్యర్థ పదార్థాల కేంద్రాలను అన్ని గ్రామ పంచాయతీలో వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డివి లలితకుమారి, భట్టిప్రోలు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపిడిఒ చంద్రశేఖర్, కార్యదర్శులు రాంకుమార్, శ్రీనివాసరావు, రాజశేఖర్ రెడ్డి, నాయకులు చెన్నయ్య, మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వాలీబాల్ పోటీకి సురేపల్లి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-భట్టిప్రోలు: ఈ నెల 23 నుంచి 25 వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టులో ఆడేందుకు సురేపల్లి విపి అండ్ జిఎస్ఎం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని యరగళ్ల వీర రాఘవ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాస శర్మ తెలిపారు. అండర్ 17 విభాగంలో జట్టులో ఆడేందుకు పాఠశాల విద్యార్థిని ఎంపిక కావటమే కాక జిల్లా జట్టుకు కోచ్‌గా ఇదే పాఠశాల పిఈటి జివిఎస్ నాగేశ్వరరావు కూడా ఎంపిక కావటం గర్వంగా ఉందన్నారు. శనివారం పాఠశాల అధ్యక్షులు వేపురి చలమయ్య, రావు రమణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనదారులు ఇన్సూరెన్స్ చేయించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించాలని బాపట్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు అన్నారు. శనివారం బాపట్ల రవాణా శాఖ కార్యాలయంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహన చోదకులకు ఇన్సూరెన్స్, ఆవశ్యకత గురించి వివరించారు. ప్రమాదాలు సభవించినప్పుడు పరిహారం పొందే సౌలభ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మోటారు వాహన తనిఖీ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు గిరి కుమార్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీమన్నారాయణ, అధికారులు, వాహనదారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వ్యవసాయ కళాశాల అమృతోత్సవం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల వ్యవసాయ కళాశాలలో సృష్టించబడిన బిపిటి-5204 వరి వంగడం అంతర్జాతీయ ఖ్యాతిని గడించడమే కాకుండా విశ్వవ్యాప్తంగా సంవత్సరానికి 30 వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తోందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఏ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను ఆయన ప్రారంభిస్తూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 11వ స్థానంలో నిలిచిందని తెలిపారు. బోధనలో, పరిశోధనలో, విస్తరణలో ప్రత్యేక స్థానాన్ని సాధించిందని ఆయన తెలిపారు. దేశం మొత్తం మీద రూపొందించబడుతున్న వరి వంగడాల్లో 1/3వ వంతు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయమే సృష్టిస్తుందని ఆయన అన్నారు. గ్రామీణ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ ఈ ఉత్సవం తొలుత ఎడ్లబండ్లపై సంప్రదాయ కేరళ వాద్య బృందం మేళ తాళాలతో ఊరేగింపుగా ప్రారంభమైంది. శాస్త్రీయ భరత నాట్యం, విద్యార్థినీ విద్యార్థుల గ్రామీణ కోలాటాలు చేస్తుండగా డాక్టర్ ఎ విష్ణువర్ధన్ రెడ్డి ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల వ్యవసాయ సంబంధిత ప్రదర్శన శాలలను ప్రారంభించారు. పెవిలియన్ వద్ద జరిగిన బహిరంగ సభలో రికార్డ్ స్థాయిలో 1200 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ కళాశాలతో తమకు గల అనుబంధాన్ని ఆత్మీయంగా పంచుకున్నారు. అనంతరం ఉప కులపతి రైతు విగ్రహం వద్ద ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను మరియు బీపీటీ-5204 పైలానును ఆవిష్కరించారు. పైలాను వద్ద నుంచి పెరేడ్ ఆఫ్ ప్రైడ్ రెట్రోవాక్‌ను మేళ తాళాలతో నిర్వహించారు. అనెక్స్ భవనం వద్ద సంప్రదాయ రాజస్థానీ, గ్రామీణ కోలాటాలతో వీరికి ఘన స్వాగతం పలికారు. 1975 సంవత్సర పూర్వ విద్యార్థులు 75 కొబ్బరి మొక్కలు నాటి సరికొత్త కొబ్బరి తోటను ప్రారంభించారు. పలువురు పూర్వ విద్యార్థులు నూతన అతిథి గృహ నిర్మాణానికి భూరి విరాళాలు అందజేశారు. అత్యంత అట్టహాసంగా ప్రారంభమైన అమృతోత్సవంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి రామారావు, వ్యవసాయ డీన్ డాక్టర్ ఏ ప్రతాప్ కుమార్‌రెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్ ప్రశాంతి విస్తరణ డైరెక్టర్ డాక్టర్ పి రాంబాబు విద్యార్థి విభాగ డీన్ డాక్టర్ పి సాంబశివరావు కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ సిహెచ్ చిరంజీవి అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఏ మణి, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పూర్వ అసోసియేట్ డీన్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల అమృతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వ్యవసాయ విద్య, పరిశోధనల్లో ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయానిది..

కీలక పాత్ర: మంత్రి కాకాని

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దేశ వ్యవసాయ విద్యా వ్యవస్థలోనూ, అభివృద్ధి, పరిశోధనల్లోనూ ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చెప్పారు. వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ 75వ ఉత్సవాలు శనివారం బాపట్లలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం ఘనంగా జరిగాయి. 75 ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు సూచికగా రూపొందించిన సావనీరును మంత్రి, అతిథులు కలిసి ఆవిష్కరించారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కళాశాల ఉత్సవాలకు శుభాకాంక్షలు తెలుపుతూ మెసేజ్ పంపారని వేదికపై మంత్రి వివరించారు. వ్యవసాయ కళాశాల అమృతోత్సవంలో 1200 మందికి పైగా పూర్వ విద్యార్థులు కళాశాలతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. పూర్వ విద్యార్థుల కలయికతో భావోద్వేగాలు, మధుర జ్ఞాపకాలకు కళాశాల వేదికగా మారింది. కళాశాల ఆడిటోరియంలో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. బాపట్ల వ్యవసాయ కళాశాలలో సష్టించిన బిపిటి-5204 వరి వంగడం అంతర్జాతీయ ఖ్యాతిని గడించిందంటూ ప్రత్యేక ప్రత్యేకంగా ప్రదర్శించారు. కళాశాల చేపడుతున్న పరిశోధనలకు సంబంధించిన స్టాల్స్ విద్యార్థులను ప్రత్యేకంగా ఆకర్షించాయి.

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్

దేశంలోని 74 వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయస్థాయిలో 11వ స్థానంలో నిలిచి బోధన, పరిశోధనలు, విస్తరణలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఏ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో సష్టించిన బిపిటి-5204 వరి వంగడం అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టిందన్నారు.

వ్యవసాయ రంగంలో కొత్త వంగడాల రూపకల్పనకు బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేస్తున్న పరిశోధనలను రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహులు ప్రశంసించారు. యువ రైతులను చైతన్య పరచడం, వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి బాపట్ల కళాశాల అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థలో వచ్చే మార్పులను అంచనాలు వేసి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వాటి పరిణామాలపై పరిశోధనలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లం అన్నారు. రైతులకు మేలు జరిగే ఆచరణాత్మక నిర్ణయాలతో మరిన్ని పరిశోధనలు చేయాలన్నారు.

అనంతరం రైతు విగ్రహం వద్ద ప్లాటినం జూబ్లీ పైలాన్, బీపీటీ-5204 పైలానును ఉప కులపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, కళ్యాణి, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి రామారావు, వ్యవసాయ డీన్ డాక్టర్ ఏ ప్రతాప్ కుమార్‌రెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్ ప్రశాంతి, విస్తరణ డైరెక్టర్ డాక్టర్ పి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకు సాగు నీరు అందించాలి

నీరు అందక ఏ రైతూ బాధపడకూడదు ● వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

నాగార్జున సాగర్ కాలువ అద్దంకి బ్రాంచ్ కెనాల్ ద్వారా పర్చూరు నియోజకవర్గ పరిధిలో సరఫరా అవుతున్న సాగునీరు కాలువ చివరి భూముల రైతుల పంటల వరకు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణ మోహన్ అన్నారు.

మండల పరిధిలోని బొల్లాపల్లి సాగర్ కాలువపై శనివారం రైతులు,అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించిన ఆమంచి సంబంధిత అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగా కాలువను పరిశీలించిన ఆమంచి కృష్ణమోహన్‌కు ఎన్ఎస్‌పి కెనాల్ డీఈ స్వామి నీటి పారుదల వివరాలను తెలిపారు. లక్కవరం గ్రామం వద్ద గల 37 లాకుల వద్ద ప్రస్తుతం 490 క్యుసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయని, కోటపాడు మేజర్‌కు 220 క్యూసెక్కులు, నూతలపాడు మైనర్‌కు 180 క్యూసెక్కులు, సమీప గ్రామాలకు 90 క్యూసెక్కుల నీటి సరఫరా చేస్తున్నట్లు డీఈ తెలిపారు. వారబందీలో భాగంగా సోమవారం నుంచి పామిడిపాడు మేజర్‌కు, ద్రోణాదులకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమంచి కృష్ణ మోహన్ మాట్లాడుతూ.. సాగర్ జలాల పట్ల పూర్తి అవగాహన చేసుకొని నూతలపాడు మైనర్ పరిధిలోని నాగులపాలెం, ఆదిపూడి, ఉప్పుటూరు, వీరన్నపాలెం కాలువ చివరి భూముల వరకు రైతులకు నీటి సరఫరా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం స్థానిక రైతులు, వైసిపి నాయకులను అడిగి స్థానిక సమస్యలు గురించి తెలుసుకున్నారు. 'ఆచరణకు సాధ్యం కాని హామీలు తాను ఇవ్వనని, చేయగలిగింది పూర్తి చేసేంతవరకు విశ్రమించనని, అందుకు అధికారులు సహకరించాల'ని కోరారు. సమస్యల పరిష్కారానికి అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆయన అన్నారు. అనంతరం కోటపాడు, కోలలపూడి, చిమ్మిరిబండ, ద్రోణాదుల, పూనూరు గ్రామాలలోని సాగర్ కాలువను పరిశీలించి నూతలపాడు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈలు బాలకృష్ణ, సుబ్బారావు, రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యటిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామం వద్ద ఉన్న నూతలపాడు మైనర్ కెనాల్ నాగార్జున సాగర్ పంట కాలువలను వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ శనివారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పర్చూరు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పిడపర్తి కోటిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్, మేకా అక్కయ్య, గన్నవరం గ్రామ వైసీపి నాయకులు, వేణు పర్చూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు దేవరపల్లి గ్రామ ఉప సర్పంచ్ తోకల కృష్ణమోహన్, ఉమ్మడి ప్రకాశం మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, వైసిపి సీనియర్ నాయకులు కాకోలు వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి అనీల్ చౌదరి, గడ్డం మస్తాన్ వలి, పుట్ట అయ్యప్ప స్వామి, గన్నవరం బుడే, కారుసోల సులేమాన్, వలపర్ల గ్రామ బుజ్జి బ్రదర్స్, ముస్లిం మైనార్టీ కార్యదర్శి షేక్ సర్దార్, అడపా సుధాకర్ రెడ్డి, యద్దనపూడి మండలానికి చెందిన ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
ఆదివారం 22 జనవరి 2023

విద్యార్థుల చదువుకు ఆటంకం కలగనీయం

ఎంఇఒ నరసింహారావు

ప్రజాశక్తి-గిద్దలూరు

విద్యార్థులు చదువుకు ఆటంకం కలగకుండా చూస్తామని మండల విద్యాశాఖ అధికారి నరసింహారావు అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని రాయల్ స్కూల్ 2022-23 అకాడమిక్ సంవత్సరంలో 186 మంది విద్యార్థులను చేర్చుకుని అర్ధాంతరంగా మూసివేసిన పాఠశాలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాయల్ స్కూల్‌లో చదివే 90మంది విద్యార్థులను వారికి నచ్చిన పాఠశాలలో చేర్పిం చినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్నామని వారిని కూడా సోమవారానికి పాఠ శాలలో చేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాయల్ స్కూల్లో 10వ తరగతి చదివే పిల్లలకు ఎటువంటి ఆటంకం జరగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు

హసన్ ఫాతిమా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్ ఓక్రిడ్జ్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. రాబోయే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు బాగా చదివి ఉన్నత ర్యాంకులు సాధించాలని ట్రస్ట్ అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్ ఆకాంక్షించారు. ముఖ్యఅతిథిగా ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ఓక్రిడ్జ్ స్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్ మాట్లాడారు. ముందుగా ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని అంబటి భవ్య శ్రీ చేసిన కూచిపూడి నత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సంస్థ తరపున భవ్యశ్రీని ప్రశంసాపత్రంతో సత్కరించారు. రిటైర్డ్ టీచర్ బ్రహ్మయ్య మాస్టర్ మహబూబ్ రచించిన నూతన సంవత్సర గీతాన్ని ఆలపించి సభికుల కరతాళధ్వనులు అందుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి షేక్ హుమయూన్ బాషా పాల్గొన్నారు.

కందిలో వెర్రి తెగులు నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని కందిపంటలో వెర్రితెగులు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌కె జైనులాబ్దిన్ అన్నారు. శనివారం మండలంలోని మల్లవరం గ్రామం నందు పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షేక్ జైనులుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

చోడవరంలో 'పొలంబడి'

కొండపి: కొండపి మండలంలోని చోడవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి వి.రాము ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం శనివారం నాడు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపిసిఎన్‌ఎఫ్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్.సురేష్, పి.శ్రీహరి పాల్గొన్నారు.

బాలినేనిని సత్కరిస్తున్న దృశ్యం

'బాలినేని'కి ఘన సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని శనివారం నాడు శింగరాయకొండ వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు శీలం రాము ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నెల్లూరు నుంచి ఒంగోలుకి వెళ్తున్న బాలినేనిని బాలాజీనగర్ జాతీయ రహదారి మీద కలిసి గజమాలతో సన్మానించారు. వీరి వెంట యనమల మాధవి, రాపూరి ప్రభావతి, షేక్ సలీంబాషా, చొప్పర వెంకన్న, సుదర్శి వెంకటరావు, పసుపులేటి సతీష్, ప్రళయ కావేరి శివ, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు ఉన్నారు.

ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్ తన జన్మదిన వేడుకల సందర్భంగా ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులను శనివారం అందజేశారు.

లక్ష్యం చేరుకోని సిబ్బందిపై చర్యలు

- కూలీల సంఖ్యను పెంచేలా కృషి - డ్వామా పీడీ శీనారెడ్డి

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామీణ ప్రాంతాలలో వలసల నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు ఎక్కువమంది హాజరయ్యేలా కషి చేయాలని, లక్ష్యం చేరుకోలేని క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె శీనారెడ్డి హెచ్చరించారు. శనివారం టంగుటూరు మండల కేంద్రంలోని పలు ప్రాంతాలలో ఉపాధి పని చేస్తున్న ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ టంగుటూరు మండలంలోని గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాలపై ఆయన ఆరా తీశారు. ప్రతి గ్రామంలోనూ వెంటనే పనులు ప్రారంభించాలని సిబ్బందిని ఆదేశించారు. మండలం మొత్తం మీద ప్రతిరోజూ 1500 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరు కావాలన్నారు. ఈ హాజరు శాతంలో ఆయా గ్రామ పంచాయతీలకు కేటాయించిన కూలీల లక్ష్యం చేరుకోలేని

ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శీనారెడ్డి

సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కూలీల జాబ్ కార్డులను వారి ఆధార కార్డులకు అనుసంధానం చేయాలని, లేని యెడల సదరు జాబ్ కార్డులను తొలగించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి పీడీ శీనారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ ఎం సుభాషిణి, ఈసీ ఎల్ దివి కుమార్, టిఏ బాబు, ఎఫ్ఏ మనోహర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

ఉచిత వైద్యశిబిరాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, వైద్యశిబిరం ఏర్పాటుచేయడం అభినందనీయమని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక కొత్తకుమ్మరిపాలెంలో కృతి సంస్థ సహకారంతో ఒంగోలు కిమ్స్ ఆసుపత్రివారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమ సహాయసహకారాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు ఎంతగానో వైద్యశిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ఈ సంధర్భంగా 200మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కిమ్స్ వైద్యులు ప్రీతి,

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. శనివారం మైలవరంలో జరిగిన గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే జగన్ లక్ష్యం: కుందురు

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పొదిలి నగర పంచాయతీ ఒకటో సచివాలయం 4, 6వ వార్డుల పరిదితూర్పుపాలెం, నేతపాలెం, దాసరి గడ్డ, ఎమ్మార్వో ఆఫీస్ స్ట్రీట్ ఏరియాలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమీషనర్ డానియల్ జోసఫ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస



ప్రజలతో మాట్లాడుతున్న కుందురు నాగార్జునరెడ్డి

రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కె నూర్జాహన్ బేగం, వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, జి శ్రీను, కల్లం సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి కొవెలకుంట్ల నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీగా అబ్దుల్ కరీం కొనసాగింపు

ప్రజాశక్తి-శింగరాయకొండ

అబ్దుల్ కరీం

ప్రభుత్వ ఖాజీగా శింగరాయకొండ చెందిన షేక్ అబ్దుల్ కరీంను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఉలవపాడు, శింగరాయకొండ మండలాలకు ప్రభుత్వ ఖాజీగా అబ్దుల్ కరీం 6-9-2025 వరకు కొనసాగుతారని ఆ ఉత్తర్వులు జారీ చేశారు.

23న అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం మరియు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో జనవరి 23న విజయవాడ బాలోత్సవ భవన్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపి సర్పంచ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి, తెలుగుదేశం, బిజెపి, జనసేన, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, జై భీమ్ తదితర పార్టీల ముఖ్య నాయకులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, గ్రామ పంచాయతీల బలోపేతం కోసం, సర్పంచుల విధులు డిమాండ్ల పరిష్కారం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బడుగులకు అండగా 'రావులపల్లి'

ప్రజాశక్తి-మార్కాపురం

అభ్యుదయ భావాలతో కమ్యూనిస్టు పార్టీలో తుది శ్వాస వరకు పనిచేసిన కీర్తిశేషులు రావులపల్లి చెంచయ్య బడుగులకు అండగా నిలిచారని గిద్దలూరు శాసన సభ్యులు అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రావులపల్లి చెంచయ్య వర్ధంతి సభలో రాంబాబు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పందీటి కాశీరావు మాదిగ, ఎఐటియుసి జిల్లా నాయకులు షేక్ ఖాశిం, ఎంపిజె జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, టిడిపి నాయకులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మహాసభలకు వేలాదిగా తరలిరండి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఈనెల 29, 30 తేదీలలో తిరుపతిలో జరగబోయే మహాసభలకు భారీ ఎత్తున తరలి రావాలని ఏటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్ నందు ఏఐటీయూసీ అనుబంధ సంస్థలతో ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ సిపిఐ నాయకులు అందే నాసరయ్య ఏఐటియుసి జిల్లా నాయకులు షేక్ ఖాసిం పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-పిసిపల్లి

స్థానిక జూనియర్ కళాశాలలో బ్యాంకు లావాదేవీలు ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు సిబ్బంది కళాజాత బందం వారిచే శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ టి.రాజశేఖర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రమాదాలు మానవ తప్పిదాలతో ఎక్కువగా జరుగుంటాయని, జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరమవుతాయని మార్కాపురం ఆర్‌టిఓ అమర్‌నాయక్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కె.మాధవరావు, జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. చంద్రశేఖరరెడ్డి, ఎఒ సుదర్శన్ పాల్గొన్నారు.

శింగరాయకొండ: వాహనాలు నడిపేటప్పుడు వాహనదారుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారి కిరణ్ ప్రభాకర్ అన్నారు. శనివారం నాడు శింగరాయకొండ గీతం, అమత కళాశాలలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్లు జయప్రకాష్, సురేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొండపి: ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడకం వల్ల తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని కొండపి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. శనివారం నాడు కొండపిలో వాహనదారులకు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఏఎస్ఐ అంకాలరావు పాల్గొన్నారు.

తర్లుపాడు: ద్విచక్రవాహనదారులు ఇక నుండి తప్పని సరిగ్గా హెల్మెట్ ధరించాలని పొదిలి సిఐ యు.సుధాకర్ శనివారం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని మేకలవారిపల్లె టోల్‌గేట్ వద్ద ద్విచక్రవాహనదారులకు కౌన్సిలింగ్

మాట్లాడుతున్న ఆర్‌టిఒ అమర్‌నాయక్

ఇచ్చారు. కార్యక్రమంలో తర్లుపాడు ఎస్ఐ పి.ముక్కంటి పాల్గొన్నారు.

టంగుటూరు: ప్రతి ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక టోల్ ప్లాజా వద్ద హెల్మెట్ ప్రాముఖ్యతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సైలు షేక్ ఖాదర్ బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేషన్ ఇంటికి తెచ్చి..ఇస్తున్నారా.?

ప్రజాశక్తి-వెలిగండ్ల

'రేషన్ సరుకులు ఇంటింటికీ వచ్చి ఇస్తున్నారా.? లేదా.?' అని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శనివారం మండల కేంద్రమైన వెలిగండ్లలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందించేందుకే సిఎం జగన్మోహన్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారన్నారు. లబ్ధిదారులకు అందే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇంకా ఏమైనా పథకాలకు అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాలంటీర్లు సకాలంలో పింఛన్లు ఇస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. అర్హత ప్రామాణికంగా, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రామన మహాలక్ష్మీ, వైస్ ఎంపిపిలు తాతపూడి మేరిపుష్ప, వై.భారతి, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, నాగూర్ యాదవ్, సర్పంచి సురేష్‌బాబు, సింగిల్‌విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు పొల్లా సుబ్రమణ్యం, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, రాష్ట్ర ముదిరాజ్ సంఘం డైరెక్టర్ కె.పద్మావతి, కె.వెంకటరామయ్య, మేడం ఆదిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

'గడపగడపగకూ..'లో ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్

ఎమ్మెల్యే బుర్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఐ

కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కనిగిరి క్యాంపు కార్యాలయంలో శనివారం వెలిగండ్ల ఎస్ఐ పి.మహేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వెలిగండ్ల మాజీ జడ్‌పిటిసి రామన్న తిరుపతిరెడ్డి, మండల వైసీపీ నాయకులు నాగూర్‌యాదవ్, ఉపాధ్యాయుడు తాతపూడి దేవసహాయం, కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కనిగిరి ఎంపిపి దంతులూరి ప్రకాశం, దమ్ము కేశవులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

టిడిపి కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలో శనివారం ఇద్దరు టిడిపి కార్యకర్తలు మృతి చెందడంతో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి నివాళులర్పించారు. శింగరాయకొండకు చెందిన కుర్రా లక్ష్మీనారాయణ, మూలగుంటపాడుకు చెందిన రేణుమాల ఇస్రాయేల్ అనారోగ్యం కారణంగా మృతిచెందారు. వీరి మృతదేహాలను ఎమ్మెల్యే సందర్శించి.. పూలమాల వేసి.. నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు కూనపు రెడ్డి, వెంకట సుబ్బారావు, కుర్రా సుబ్బారావు, కుర్రా వాసు, సందాని బాషా, మించల బ్రహ్మయ్య, వేల్పుల సింగయ్య, ఇమ్మడిశెట్టి రామారావు, నరాల సుధాకర్, సేలం చంద్రశేఖర్, పాశం శ్రీనివాసరావు ఉన్నారు.

తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ రంగసుబ్బరాయుడు

వాదంపల్లి సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని వాదం పల్లిలో సచివాలయాన్ని శనివారం ఎంపిడిఓ ఎం. రంగసుబ్బరాయుడు తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆధార్ ప్రత్యేక కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి, వాదంపల్లి, వీరభద్రపురం, మొగుళ్లపల్లి గ్రామాలలోని సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పద్మజ

సమావేశాలకు అధికారులు విధిగా హాజరుకావాలి: ఎంపిపి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశాలకు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని, ఎవరైనా గైర్హాజరైతే చర్యలు తీసుకోవాలని ఎంపిపి గుమ్మా పద్మజ అన్నారు. పెద్దదోర్నాల మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గుమ్మా పద్మజ అధ్యక్షతన స్థానిక మండలపరిషత్ సమావేశపు నిర్వహించారు. సమావేశాలకు అధికారులు హాజరుకాకపోవడాన్ని ఎంపీటీసీలు, సర్పంచులు ప్రస్తావించగా, గుమ్మా పద్మజ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు అధికారులు హాజరుకాకపోవడం, వారికి మండలంలోని సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉందో, లేదో తేటతెల్లమవుతుందన్నారు. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులపై వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో మంచినీరు, విద్యుత్, వైద్య సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నాసరరెడ్డి, వైస్ ఎంపీపీలు దర్శనం నాగయ్య, పరుచూరి శ్రీలక్ష్మి, తహశీల్దార్ వేణుగోపాల్‌తో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రభుత్వం ద్వారా పశుపోషకులకు అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.బేబీరాణి సూచించారు. శుక్రవారం మండలంలోని సూరారెడ్డిపాలెం పశువైద్య కేంద్రాన్ని జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసిన జేడీ పశువైద్యశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జేడీ మాట్లాడుతూ పాడి రైతులకు అవసరమైన సబ్సిడీ పరికరాలతో పాటు సమీకృత దాణా, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి ప్రయోజనాల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామంలో గతంలో ఉన్న అమూల్ పాలకేంద్రం మూత పడటానికి గల కారణాలు, తిరిగి కేంద్రాన్ని నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పథకాలను పశుపోషకులకు వివరించి అమూల్ కేంద్రంలో పాలు పోస్తే చేకూరే ప్రయోజనాలను పాడి రైతులకు వివరించాలని జేడీ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ జి.విజయ మాధవి, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

చూశారు..వెళ్లారు..

- రోడ్డుపై ఆగని మురుగునీరు..
- ఇబ్బందులు పడుతున్న జనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా రోడ్డుపై మురుగునీరు పారుతూనే ఉంది. శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని కనుమళ్ల రోడ్డులో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. ఈద్గామిట్ట నుంచి ఇళ్లలోని మురుగునీరు కాలువల ద్వారా కనుమళ్ల రోడ్డుకు మళ్లించారు. అక్కడ జాతీయ రహదారి ఉండటంతో అధికారులకు ముందస్తు అంచనాలు లేకపోవడం వల్ల.. ఆ మురుగునీరు రోడ్డుపై ఆగిపోయింది. శింగరాయకొండ, మూలగుంటపాడు గ్రామాల నుంచి ఒంగోలు వైపునకు వెళ్లాలన్నా.. కందుకూరు వైపునకు వెళ్లాలన్నా.. ఈ రోడ్డునే వినియోగిస్తుంటారు. కనుమళ్ల నుంచి శింగరాయకొండకు వచ్చే జనం ఆ మురుగునీరు దాటి రావాల్సిందే. ప్రత్యేకించి పాఠశాలకు నడిచి వచ్చే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కనుమళ్ల గ్రామంలో గత రెండు నెలల క్రితం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కొండపి వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు హాజరయ్యారు. అక్కడ గ్రామస్తులు మురుగునీటిపై ఆయనకు ఫిర్యాదు చేశారు. సమస్యను తక్షణమే పరిష్కారం చేస్తానని అశోక్‌బాబు హామీ ఇచ్చారు. రెండు నెలలు గడుస్తున్నా ఆ హామీ నెరవేరలేదు. శింగరాయకొండ ఎంపీపీ కట్టా శోభారాణి మండల పరిషత్ సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. అయినా అధికారులు వినటం తప్ప సమస్యను పరిష్కరించని పరిస్థితి ఇక్కడ కనిపిస్తుంది. దీని కారణంగా మురుగు నీటిలో నడవలేక పిల్లలు, పెద్దలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు మీద మురుగునీరు

చెంచయ్య సేవలు మరువలేనివి: సిపిఐ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి చెంచయ్య సేవలు మరువలేనివని సీపీఐ సీనియర్ నాయకులు టీసీఎచ్ చెన్నయ్య అన్నారు. యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం రావులపల్లి చెంచయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

ప్రేమ్ కుమార్‌ను సన్మానిస్తున్న వంశీధర్‌రెడ్డి

తహశీల్దార్ ప్రేమ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-గిద్దలూరు

తహశీల్దార్‌గా రాజారమేష్ ప్రేమ్ కుమార్ అందించిన సేవలు అభినందనీయమని మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి అన్నారు. మండల తహశీల్దారుగా చేసి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన రాజా రమేష్ ప్రేమ్ కుమార్‌ను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బత్తెం ఓబులరావు, ఈదుల పాండు రంగారెడ్డి, లక్ష్మీరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గానాల రామ్మూర్తి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కీర్తిశేషులు గానాల రామ్మూర్తి 131వ జయంతి వేడుకలను శనివారం ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు ముత్తలూరి మల్లికార్జునచారి మాట్లాడుతూ మన విశ్వబ్రాహ్మణ జాతిపిత గానాల రామ్మూర్తి అని తెలిపారు. వీరి పూర్వీకులు విజయనగరం రాజ్యంలో సంగీతంలో గానగంధర్వ విద్వాంసులుగా కీర్తించబడినట్లు తెలిపారు. దీంతో ఇంటి పేరును ఆనాటి నుండి గానాల ఇంటిపేరుగా పిలవబడుచున్నారని చెప్పారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ జమ్మోజు వెంకటేశ్వర చారి రామగిరి గిరిబాబు, రంగోజు మల్లికార్జున చారి, మహేశ్వరం కోటేశ్వర ఆచారి, ముత్తలూరి సత్యనారాయణ చారి, నందిగం పాలంకయ్య పాల్గొన్నారు.

చెంచు గిరిజన గూడేల్లో వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని బిళ్లగొంది పెంట, పోతురాజు పెంట, గౌతమ బుద్ధుని కాలనీ, రేగులపల్లి, పుల్లయ్యకుంట తదితర చెంచు గిరిజన గూడేల్లో శనివారం వెంకటాద్రిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కోటా నాయక్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారందరికీ ఐరన్ టానిక్కులు, ప్రొటీన్ పౌడర్లు అందజేశారు. ఇతర సీజనల్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి.. మందులు పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విద్యను బోధించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఆవులయ్య, నాగలక్ష్మి, శ్రావణి, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, అంకమ్మ, ఆశా వర్కర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పూర్ణకంటి భూషమ్మ, వెంకటయ్య దంపతులకు శనివారం అయినముక్కల గ్రామములో క్రీస్తు సంఘం ఇవాంజలిస్టు డిపి ఏసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కుట్టు మిషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీస్తు సంఘం ఇవాంజలిస్ట్ డిపి యేసయ్య, క్రీస్తు సంఘం సువార్తికులు, సభ్యులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో సైకిల్‌పై యాత్ర చేస్తూ యర్రగొండపాలెం వచ్చిన ధీరజ్ కుమార్ గుప్తాకు శనివారం యర్రగొండపాలెంలోని అంబేద్కర్ సెంటర్లో పలువురు స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. డిగ్రీ పట్టభద్రుడు అయిన ధీరజ్ గుప్తా 30 ఏళ్ల వయసులోనే సైకిల్ యాత్రలో ఒంటరిగా భారత దేశంలోని అన్ని రాష్ట్రాలను చుట్టేసే పనిలో పడ్డారు. దేశంలో శాంతి నెలకొనాలని, సర్వ మత సమ్మేళనం, దేశశాంతి ముఖ్య ఉద్దేశ్యంతో బీహార్ రాష్ట్రం పదరా కోటకు చెందిన ధీరజ్ కుమార్ గుప్తా భారత దేశ సైకిల్‌పై యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, తెలుగుదేశం పార్టీ నాయకులు యస్ యండి యూసుఫ్, సిపిఐ నాయకులు నాయకులు చెన్నయ్య, క్రిష్ణగౌడ్, గురువయ్య పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

- సద్వినియోగం చేసుకోవాలి
- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, రేపల్లె మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కోర్టు హాల్లో వెంకటేశ్వర్లు అధ్యక్షతన రేపల్లె పట్టణ మరియు రూరల్ సిఐలు, ఎస్ఐలు, కోర్టు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులను అదాలత్‌లో పరిష్కారం అయ్యే విధంగా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం అయ్యే విధంగా కక్షిదారులకు తెలియజేసి అదాలత్‌లో పరిష్కారం అయ్యే విధంగా చూడాలని జడ్జి కోరారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ పట్టణ సీఐ విజయచంద్ర, నాలుగు మండలాల ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లెలో సమీక్ష సమావేశం, అద్దంకిలో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ బి బాబు నాయక్

అద్దంకి: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కువ కేసులు రాజీపడే విధంగా చర్యలు తీసుకోవాలని అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి బి బాబునాయక్ కోరారు. స్థానిక కోర్టు సముదాయంలో ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌పై సమీక్ష కార్యక్రమం పోలీసు అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి బి బాబు నాయక్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ రాజీపడదగిన క్రిమినల్ కేసులను ఆయా వర్గీయులతో మాట్లాడి రాజీ చేయాలని కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అదాలత్‌కు సంబంధించి ప్రతి స్టేషన్‌కు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించి ప్రతిరోజూ కేసుల గురించి పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియదర్శిని, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ గ్రాండ్ టెస్ట్ విజేత భాగ్యశ్రీ రేఖ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రభుత్వాలు కల్పించే ప్రోత్సాహకాలు అందుకునేందుకు విద్యార్థులందరూ దృఢ సంకల్పంతో కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజె రామారావు సూచించారు. బాపట్ల జిల్లా స్థాయి ఎన్ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్ శనివారం గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ గ్రాండ్ టెస్ట్‌కు జిల్లా పరిధిలో మొత్తం 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి పివిజే రామారావు ముఖ్య అతిథిగా హాజరై మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు దాతలు సమకూర్చిన బహుమతితోపాటు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. మొదటి స్థానంలో నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం భాగ్యశ్రీ రేఖ రూ.2000 నగదు, ద్వితీయ స్థానంలో ఇరువురు విద్యార్థులు ఐ రిషిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట వేటపాలెం, జి దీప్తి, నాగ కౌసల్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐలవరం భట్టిప్రోలు మండలం రూ.1500 నగదు, తృతీయ స్థానంలో కె మీరా రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నిజాంపట్నంలకు వెయ్యి రూపాయల నగదు బహుమతులను దాతల సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా డిఇఓ రామారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అందజేస్తున్న ఉపకార వేతనాలు పొందేందుకు విద్యార్థులు అందరూ కృషి చేసి సాధించాలని పిలుపునిచ్చారు. నగదు బహుమతులు అందజేసిన దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు భట్టిప్రోలు మండల విద్యాశాఖ అధికారి పులి లాజరు, ఉపాధ్యాయులు కాటూరి లక్ష్మీనారాయణ, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ గ్రాండ్ టెస్ట్ విజేతకు బహుమతి అందజేస్తున్న డిఇఓ పివిజె రామారావు

పురంధరదాసుల వారి ఆరాధన మహోత్సవాలు

ప్రజాశక్తి-అద్దంకి: తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రా జెక్టు, దాస భారతీయ జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో కన్నడ పద కవితా పితామహుడు పురంధర దాసుల వారి 449వ ఆరాధన మహోత్సవాలు అద్దంకిలోని పురంధరదాసుల విగ్రహం వద్ద శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పురంధరదాసుల విగ్రహానికి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం స్థానిక సాహితీ పెద్దలు, కవులు పూలమాలలు వేసి పురంధరదాసుల వారి గురించి ఉపన్యసించారు. చెన్నుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ పురంధరదాసులవారు 4 లక్షల 75 వేల కీర్తనలను రచించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్‌జేడి యు దేవపాలన, రోటరీ క్లబ్ అఫ్ శింగరకొండ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, సాహితీ విశ్లేషకులు అన్నమనేని వెంకటరావు, హిందీ పండిట్ దరమవరపు శ్రావణ్ కుమార్, కోలాటం మాస్టర్ జాస్తి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి రామాంజనేయులు, దివాకర్ దత్తు, వారణాసి రఘురామశర్మ, తాళ్లూరి బాబురావు, జ్యోతి రమేశ్, వాసవి వనితా క్లబ్ గవర్నర్ ఊటుకూరు ఉమా అన్నపూర్ణమ్మ, భజన పంతులు షేక్ జాన్ సాహెబ్, సైదావలి, అంజాద్‌బాషా, మాదాల దానయ్య, పెద్దిశెట్టి వెంకటాద్రి, పుట్టా వీరాంజనేయులు పాల్గొన్నారు.

పట్టణంలో శ్రీ పురంధర దాసుల వారి ఆరాధన మహోత్సవ కార్యక్రమం

ఘనంగా గానాల రామమూర్తి జయంతి

ప్రజాశక్తి-అద్దంకి

విశ్వబ్రాహ్మణ వంశీలను బీసీ జాబితాలో చేర్పించిన మహనీయుడు మాజీ ఎమ్మెల్సీ గానాల రామ్మూర్తి 132వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పొన్నపల్లి బ్రహ్మానందం అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మాట్లాడుతూ వారు చేసిన సేవలను స్మరించుకోవటం మన బాధ్యత అన్నారు. అలాంటి మహనీయుని ఆశయాల సాధనకు విశ్వబ్రాహ్మణ సంఘీయులందరూ కృషి చేయాలని కోరారు. బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మునగ నరసింహాచారి మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ ఆంధ్ర తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీగా విశిష్ట సేవలు అందించిన మహనీయుడిని స్మరించుకోవడం మన అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి కమటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ అనంత మురళీ రామ్మోహన్‌రావు, వీరబ్రహ్మేంద్రస్వామి గుడి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరకొండ నాగేశ్వరరావు, కార్పెంటర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చెన్నుపల్లి కోటిలింగాచారి, బాపట్ల జిల్లా సంఘ ప్రచార కార్యదర్శి చేబ్రోలు రవిచంద్రాచారి, అద్దంకి మండల అధ్యక్షులు సిద్దు హరికృష్ణ, స్థానిక సంఘ నాయకులు రవి, అంగలకుదుటి సాయి పాల్గొన్నారు.

పంగులూరు: పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో దివంగత బ్రహ్మశ్రీ గానాల రామమూర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటాపురం ఆచారి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి రవిచంద్ర చారి, గానాల రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విశ్వబ్రాహ్మణులుకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. సంఘ అధ్యక్షులు టి రామకృష్ణ, సలహాదారులు మేడూరి శివప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ మురికిపూడి ఓంకార్ శర్మ, సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ టి నాగేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొండముది ఆంజనేయులు, కోశాధికారి కోటపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ముప్పవరంలో..

విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో గానాల రామ్మూర్తి జయంతి వేడుకలను మండలంలోని ముప్పవరంలో ఘనంగా నిర్వహించారు. రామమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 300 మంది పాఠశాల విద్యార్థులకు, స్థానిక హాస్టల్ విద్యార్థులకు, గ్రామస్తులకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు మచ్చ అనంతాచారి, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు సిద్దు బొల్లాపల్లి, పూసపాటి సాంబశివరావు, జె పంగులూరు మండల అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పాలపూడి సురేష్‌బాబు, కోశాధికారి సిద్ధి వెంకట సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చా చిరంజీవి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మచ్చా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: విశ్వబ్రాహ్మణ జాతిపిత, ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన తొలి విశ్వబ్రాహ్మణుడు, పండిత గానాల రామమూర్తి 131వ జయంతి వేడుకలు మద్దిపాడులో ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి చెట్టు వద్ద మండల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఏలూరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం నాయకులు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి జి. వీర భద్రాచారి మాట్లాడుతూ, ఆయన పోరాట పటిమ, నాయకత్వాన్ని ప్రతిఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. ఆయన కృషితోనే నేడు విశ్వబ్రాహ్మణ జాతి గౌరవం పెరిగిందనీ, బీసీలుగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన ఆశయాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోభిరాల హరిబాబు, జంపని సురేష్ కుమార్, శివయ్య, రామయ్య సిద్ధాంతి పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-సంతమాగులూరు

జగనన్న బడుగు వికాసం పథకానికి సంబంధించిన రుణాలకు ఎస్సీ ఎస్టీ తరగతుల వారు దరఖాస్తు చేసుకోవాలని వెలుగు ఏపీఎం దుడ్డు మస్తాన్‌రావు కోరారు. దరఖాస్తుదారులు 18 సంవత్సరాల వయస్సు ఉండి, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ పథకం కింద ఎలక్ట్రిక్ కారు, ఫోర్ వీల్ ఆటోల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తారని ఆయన అన్నారు. ఇందులో 45 శాతం బ్యాంక్ ఎండ్ సబ్సిడీ ఉంటుందన్నారు. 20 శాతం లబ్ధిదారుల వాటా ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఇతర వివరాలకు సంతమాగులూరు వెలుగు కార్యాలయాన్ని సంప్రదించాలని మస్తాన్‌రావు పేర్కొన్నారు.

పాఠశాలల అభివృద్ధి అంచనాలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

రాబోయే కాలంలో విద్యాసంస్థలకు ఏమేమి అవసరాలు ఉన్నాయో వాటిని తీర్చడానికి, పాఠశాలలను అభివృద్ధిపరచడానికి కావలసిన వనరులు సమకూర్చడానికి యు డేస్ ప్లస్ అనే ప్రొఫార్మాను ఆన్లైన్లో ప్రతి విద్యా సంస్థ పూర్తి చేయాలని మండల విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. దీనికి సంబంధించి శనివారం మధ్యాహ్నం పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మాధవరావు, జయకుమార్, కృష్ణారావు పాల్గొన్నారు.

26న స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-రేపల్లె: పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ బజారులో వేంచేసి ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలు ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయని పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మునగాల నాగేశ్వరరావు ఆర్‌వి కాళేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీన రాత్రి 9 గంటల 35 నిమిషాలకు శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని వారు తెలిపారు. 27వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారి ఉత్సవమూర్తుల రథోత్సవం (ఊరేగింపు) జరుగుతుందని, 28న స్వామివారి వసంత సేవ, 29న ఆదివారం మధ్యాహ్నం 11 గంటలకు అన్న సంతర్పణ జరుగుతుందని అన్నారు. కావున సంఘీయులు, భక్తులు అదే సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

కౌన్సిల్ సమావేశ హాలులో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

అన్ని అంశాలూ పాస్..

ప్రజాశక్తి-చీరాల: ఎప్పుడూ వాద ప్రతి వాదనలతో ఘర్షణ వాతావరణంలో కొనసాగే కౌన్సిల్ సమావేశం శనివారం ఎలాంటి అరుపులు.. కేకలు లేకుండా.. ప్రశాంతంగా అన్ని అంశాలను కౌన్సిల్ అందరూ ఐక్యంగా ఆల్ పాస్ చేయడంతో కౌన్సిల్ సమావేశంలో కొత్త వాతావరణ కనిపించింది. చీరాల పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో ఉన్న మొత్తం 24 అంశాలను సభ్యులందరి అంగీకారం మేరకు పాస్ చేశారు. పురపాలక సంఘ పరిధిలోని పలు అభివృద్ధి పనుల గురించి అజెండాలో కొన్ని అంశాలను చేర్చారు. పట్టణంలోని జగనన్న మహిళా మార్టుకు సంబంధించిన మరమ్మతుల పనులు మురుగు కాలువలు, సిమెంటు రహదారులు, డ్రైనేజ్ పైపు లైన్లు, పలు పాఠశాలల అభివృద్ధి పనులు తదితర అంశాలను పొందుపరిచారు. అయితే కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి వాదన ప్రతి వాదన జరగకుండా అతి తక్కువ సమయంలో సమావేశం ముగిసింది. సమావేశంలో కమిషనర్ ఏసయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించిన వారిపై

చర్యలు తీసుకోవాలి

టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో టిడిపి నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరం 16వ డివిజన్‌లో టిడిపి ఫ్లెక్సీలు చించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి రాపూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి నేతలు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్‌రావు పుట్టిన రోజు సందర్భంగా 16వ డివిజన్‌లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 4 ఫ్లెక్సీలను చించివేశారన్నారు. గతంలో అక్కడ ఇలాంటి సంఘటనలు జరగలేదన్నారు. పార్టీల మధ్య వైషమ్యాలు పెంచటానికి ఎవరో ఫ్లెక్సీలను చించారన్నారు. రైల్వే గేటు వద్ద వేసిన ఫ్లెక్సీ వద్ద సిసి కెమెరా ఉందన్నారు. పార్టీల మధ్య వైషమ్యాలు పెంచటానికి, ప్రయత్నించి ఫ్లెక్సీలను చించిన వారిపై చర్యలు తీసుకోవాలని టుటౌన్ ఎస్పై యు.సాంబశివరావును కోరారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి బండారు మదన్, కె.నాగరాజు, వి.రమణయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐకు అర్జీ ఇస్తున్న టిడిపి నేతలు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పునరుద్ధరించాలి

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్రా మాల్యాద్రి

ప్రజాశక్తి-చీరాల

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ జనవరి 23తో ముగియనుందని, కావున రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సమావేశం జరిపి.. ఆర్డినెన్స్ ద్వారా సబ్‌ప్లాన్ చట్టాన్ని మరలా పునరుద్ధరించాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్రా మాల్యాద్రి అన్నారు. శనివారం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అనే అంశంపై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బలహీనవర్గాల నాయకుడు గోసాల ఆశీర్వాదం అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్రా మాల్యాద్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పది సంవత్సరాల పోరాటంతో సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఈ సంవత్సరం జనవరి 23తో ముగియనుందన్నారు. కావున దీనిని మరలా శాసనసభ సమావేశం జరిపి.. ఆర్డినెన్స్ ద్వారా పునరుద్ధరించాలని అన్నారు. 2013లో అమలులోకి వచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఎస్సీ, ఎస్టీలకు అనుకున్నంతగా ఉపయోగపడలేక పోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తిరిగి కొనసాగించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్ సరిగ్గా అమలు జరగలేదు కనుక ప్లాన్ గడువు పొడిగించి.. మరలా పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కెవిపిఎస్ కమిటీ సభ్యులు లింగం జయరాజు, ఎరుకల హక్కుల పోరాట కమిటీ నాయకులు మోహన్ కుమార్ ధర్మ, ప్రజావేదిక నాయకులు గుమ్మడి ఏసురత్నం, జనసేన నాయకులు శివరాం ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మీ నరసయ్య, బీఎస్పీ నాయకులు భాస్కరరావు, రవికుమార్, సురేష్, సిఐటియు నాయకులు నల్లతోటి బాబురావు, వృత్తిదారుల సంఘం నాయకులు పి.కొండయ్య, చీరాల నియోజకవర్గ సమితి నాయకులు శీలం రవికుమార్, పోస్టల్ యూనియన్ నాయకుడు కె.మార్కు, దళిత నాయకులు ఎస్‌కె. జిలాని, కట్టరాజ్ వినయ్‌కుమార్, ప్రజాసంఘం నాయకులు నాతోటి బాబూరావు, గాది హరిహరరావు, సింహాద్రి ఎలమందరెడ్డి, గోసాల సుధాకర్, కొత్తపేట మాజీ సర్పంచి ఊటుకూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అండ్రా మాల్యాద్రి

108 ఉద్యోగుల పట్ల పక్షపాత వైఖరి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు
- సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం
- కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

108 ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంబిస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు, యూనియన్ గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు విమర్శించారు. 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ భాస్కర్ అధ్యక్షత వహించారు. రిలే నిరాహార దీక్షలను ప్రారంభించిన కాలం సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 108 ఉద్యోగుల పట్ల పక్షపాత వైఖరితో ఉందని విమర్శించారు. అరవింద యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందని, పిఎఫ్, ఈఎస్ఐ యాజమాన్య వాటాన్ని చెల్లించకుండా కార్మికుల దగ్గర నుంచే వసూలు చేస్తున్నా ప్రభుత్వం, కార్మిక శాఖ చూస్తూ ఊరుకోవటం దుర్మార్గమన్నారు. 108 ఉద్యోగులు ఇచ్చిన సమ్మె నోటీసుకు ప్రభుత్వం సరిగా స్పందించలేదని విమర్శించారు. ప్రభుత్వం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న వారిపై కేసులు పెట్టడం, ఆందోళనలు చెయ్యకుండా జి ఓ నంబర్ 1అమల్లోకి తెచ్చి నియంతృత్వ పోకడలతో ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోతే వారు సమ్మెకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారం చేయాలని, లేకపోతే భవిష్యత్ ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రిలే నిరాహార దీక్షలలో లో 108యూనియన్ నాయకులు సిహెచ్ భాస్కర్, కె. వాసు బాబు, ఎస్‌డి మదార్, పి.సురేష్, ఆర్.వెంకట రమణ కూర్చున్నారు. శనివారం నాటి దీక్షలను యూనియన్ ఉపాధ్యక్షులు పి.హరిబాబు నిమ్మ రసం ఇచ్చి విరమింప చేసారు . యూనియన్ నాయకులు భాస్కర్, హరిబాబు, బాబురావు, యోహన్ , శ్రీనివాసరెడ్డి పి.హరిబాబు, మహిళా విభాగం కార్యదర్శి స్వర్ణ, సునీత, కోటేశ్వరమ్మ, జిల్లా నలుమూలనుండి 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద దీక్షలు చేస్తున్న 108 ఉద్యోగులు

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో

మరో పులివెందుల చేస్తా..

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అభివృద్ధిలో నియోజకవర్గాన్ని మరో పులివెందులగా మారుస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. శనివారం పెద్దదోర్నాలలోని సచివాలయం-2 పరిధిలో తదితర ప్రాంతాల్లో పర్యటించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అవి అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యలు కారణంగా ప్రభుత్వ పథకాలను దూరమైన వారికి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు అడగకుండానే నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ పేదల సంక్షేమ కోసం ప్రభుత్వం అనేక రకాల పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. తాను రాష్ట్ర మంత్రినైనప్పటికీ నియోజకవర్గంలోని ప్రజలకు ఎక్కువగా అందుబాటులో ఉంటానన్నారు. ఎన్నికల హామీలను ఇప్పటికే 98 శాతం నెరవేర్చామని తెలిపారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

బాలుడిని పరామర్శిస్తున్న మంత్రి సురేష్

కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు యక్కంటి వెంకటేశ్వర్లరెడ్డి, అబ్దుల్ మజీద్, గురవారెడ్డి, గుమ్మా యల్లేష్, సర్పంచ్ చిత్తూరి హరిక, ఎంపిడిఓ నాసరరెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్, వైస్ ఎంపిపిలు దర్శనం, నాగయ్య, పరుచూరి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలుగా అండగా ఉంటా..

పెద్దారవీడు: ఇటీవల కాలంలో వివిధ రోడ్డు ప్రమాదాలలో గాయపడ్డ వారిని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం పరామర్శించారు. ఇటీవల కాలంలో దొనకొండ దగ్గర జరిగిన ప్రమాదంలో పెద్దారవీడు మండలం శివపురం గ్రామానికి చెందిన మెట్టు భాస్కర్‌రెడ్డి కుమారులలో ఒకరు చనిపోగా మరో కుమారుడు తీవ్ర గాయాలతో హాస్పటల్ చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న మంత్రి సురేష్ ఆ బాలుడిని పరామర్శించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఎస్.కొత్తపల్లి గ్రామ సర్పంచి వెన్నా శివకష్టారెడ్డి తండ్రి వెన్నా సుబ్బారెడ్డిని పరామర్శించి.. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు. అనంతరం రోడ్డుప్రమాదంలో గాయపడ్డ పెద్దారవీడు మండలం ఉదయ్ న్యూస్ రిపోర్టర్ శ్రీనివాసరావు బొమ్మిరెడ్డిని కూడా మంత్రి పరామర్శించి.. మీకు ఏ సహాయం కావాలన్నా నన్ను కలవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఏరువా చలమారెడ్డి, ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, తంగిరాలపల్లి సర్పంచి తోకల ఆవులయ్య, రేగుమానుపల్లె సర్పంచి రామాంజనేయులు, సుంకేసుల సర్పంచి గుడ్డేపోగు రమేష్, వైసిపి నాయకులు వల్లెల ఈశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ రాజ్యలక్ష్మి

కంటి వెలుగు విజయవంతానికి కృషి

- మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలి
- అధికారులకు డిఎంహెచ్ఒ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించే డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు 3వ విడత కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక డిఎం,హెచ్ఓ కార్యాలయంలో శనివారం డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు 3వ విడత కార్యక్రమంపై సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా డిఎం,హెచ్ఓ మాట్లాడుతూ జిల్లా అధికారులు తయారు చేసిన సూక్ష్మ ప్రణాళిక ప్రకారం ఆయా సచివాలయాలలో నిర్ణయించిన తేదీల ప్రకారం కార్యక్రమం చేపట్టాలన్నారు. సంబంధిత పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్స్ . 60 సంవత్సరాలు పైబడిన వద్దులకు ఆయా సచివాలయాలలో కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు మూడో విడత కార్యక్రమాన్ని మే నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా సచివాలయాలలో కంటి పరీక్షలు నిర్వహించే టప్పుడు ఆశాలు, ఎఎన్ఎంలు, తప్పనిసరిగా ఉండాలన్నారు. సమీక్షా సమావేశంలో డిపిఎంఒ డాక్టర్ డి.నళిని, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.